క్లుప్తంగా

గోవుల సంరక్షణకు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు మంగళవారం గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, ఉప్పలపాడు గ్రామానికి చెందిన కలపూడి నాగవెంకట రాంబాబు, లక్ష్మీపద్మావతి దంపతులు రూ.20,100 ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

గుణాత్మక విద్యను పెంపొందించాలి



పెనుగంచిప్రోలు: విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంపొందించాలని ఎంఈఓ డి. రవీంద్ర అన్నారు. మంగళవారం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో తరగతిలో నిర్దేశించిన సామర్థ్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు పాము నాగేశ్వరరావు, మర్రి ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు విద్యా సంస్థలు బంద్

జగ్గయ్యపేట అర్బన్: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల బంద్ పిలుపులో భాగంగా పట్టణంలో మంగళవారం పలు విద్యా సంస్థలు మూసివేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌తో పాటు పలు ప్రైవేటు స్కూళ్లు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులను బయటకు పంపి బంద్ పాటించారు. ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి యండ్రపల్లి భాను మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ విజయవంతం అయిందన్నారు.

మున్సిపల్ పార్కులో నీరు నిలవకుండా చర్యలు

జగ్గయ్యపేట అర్బన్: నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ రోడ్, ఫైర్ స్టేషన్ రోడ్, చింతల తోపు, చెరువు బజారు, ఎన్ఎస్‌పీ పాత కాలనీ, సత్యనారాయణపురంలోని షేర్‌మహ్మద్‌పేట రోడ్ తదితర ప్రాంతాలలో వరద నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో వరద నీరు చేరడంతో వాకింగ్ చేసే వారికి ఆటంకంగా మారింది. మంగళవారం నీటి తొలగింపు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ వాకింగ్ చేసే వారికి ఇబ్బందిగా ఉండటంతో నీటి తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కచ్చా డ్రెయిన్ కొట్టి నీటిని బయటకు పంపిస్తున్నామన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రతో మాట్లాడి గ్రావెల్‌తో గుంతలు సరిచేస్తామన్నారు.

న్యాయవాదుల నిరసన



తిరువూరు: మణిపూర్‌లో మహిళలపై అనాగరికంగా వ్యవహరించడం, హత్యాచారం వంటి సంఘటనలకు తిరువూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం నిరసన తెలియజేశారు. మణిపూర్ సంఘటనలకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం మణిపూర్‌లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసి భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంకురాత్రి జనార్దనరావు, అంకిరెడ్డి అంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మానవ మృగాలను పెంచి పోషించడం వల్లే..

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం రాజకీయ మనుగడ కోసం మానవ మృగాలను పెంచిపోషించడం వలనే మణిపూర్‌లో దారుణమైన ఘటనలు జరుగుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నంలో మణిపూర్‌లోని జరుగుతున్న దౌర్జన్యాలు, అఘాయిత్యాలపై మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు.

దాడులను అరికట్టాలి

విస్సన్నపేట: మణిపూర్‌లో జరుగుతున్న దాడులను అరికట్టాలని గ్లోబల్ తెలుగు పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద మంగళవారం పాస్టర్లు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మద్దతుగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కెపోగు వందనకుమార్ పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

- ఉధృతంగా వాగులు
- రాకపోకలకు అంతరాయం
- నీట మునిగిన పంట పొలాలు



పెనుగంచిప్రోలు వద్ద మునేరు వరద ఉధృతి

పెనుగంచిప్రోలు: మండలంలో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షంతో దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లింగగూడెం, శనగపాడు వద్ద గండివాగులు పొంగటంతో రాకపోకలు నిలిచి పోయాయి. అలాగే అనిగండ్లపాడు–పెనుగంచిప్రోలు మధ్య దూళ్లవాగు పొంగటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద నీటికి పక్కన ఉన్న పొలాలు నీట మునిగాయి. గ్రామాల్లో రోడ్లు మొత్తం మోకాలు లోతు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మునేరుకు కూడా వరద నీరు వచ్చిచేరుతోంది. ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ వాగుల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఎడతెరపి లేకుండా..

వత్సవాయి: గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా పడుతున్న వర్షంతో మిర్చి, పత్తి పొలాల్లో నీరు నిలిచింది. పత్తి, మిర్చి చిన్న మొక్కలు కావడంతో భూమిలో తేమ శాతం ఎక్కువై ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మునేటికి కూడా భారీస్థాయిలో వరదనీరు వచ్చి చేరింది. 11 అడుగుల మేర వరద వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పెనుగంచిప్రోలు మక్కపేట రహదారి మధ్యలో రైల్వేట్రాక్ వద్ద అండర్‌పాస్ వద్ద వరద నీరు రావడంతో వాహనాలు నిలిచిపోయాయి.

ఉధృతంగా వైరా కట్టలేరు..

వీరులపాడు: ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా వైరా కట్టలేరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో నందిగామ మండలం దాములూరు వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామాల మధ్యన వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. మండలంలోని పల్లెంపల్లి వద్ద వైరా కట్టలేరు ఉధృతిని మంగళవారం ఆయన పరిశీలించారు. వైరా కట్టలేరు పరీవాహక ప్రాంత గ్రామాలు కొణతాలపల్లి, వెల్లంకి, నందలూరు, తాటిగుమ్మి, దొడ్డదేవరపాడు తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉప నదులకు పోటెత్తుతున్న వరద



దాములూరు కూడలి వద్ద కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

నందిగామ: భారీ వర్షాలకు ఉప నదులకు వరద నీరు వచ్చి చేరుతోంది. భారీ వర్షాలకు డివిజన్ పరిధిలోని వాగులు, వంకలు, చెరువులతోపాటు ఉప నదులు జల కళను సంతరించుకున్నాయి. ముఖ్యంగా ఎగువన తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఉప నదులు కళకళలాడుతున్నాయి. నందిగామ మండల పరిధిలోని దాములూరు, వీరులపాడు మండలంలోని పల్లెంపల్లి మధ్య కూడలి వద్ద నిర్మించిన కాజ్‌వేపై మంగళవారం భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో రెండు మండలాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు ఎప్పటికప్పుడు వరద పరిస్థితులపై ఆరా తీయడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఉపనదుల వరదకు సంబంధించి సిబ్బందితో సమీక్షిస్తున్నామని ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు.

కంచికచర్లలో 44.4 మిల్లీమీటర్ల వర్షపాతం..

కంచికచర్ల : మండలంలో సోమవారం 48.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మంగళవారం 44.4 మి.మీ వర్షపాతం నమోదయిందని తహసీల్దార్ శంకరబాబు తెలిపారు. ఎగువ ప్రాంతమైన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం, మధిర, వైరా, వరంగల్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణానది, మునేరు, వైరు ఉప నదులకు వరద నీరు చేరింది. వర్షాలు ఇంకా కొనసాగితే పెసర, మొక్కజొన్న, పత్తి, వరి పంటలు దెబ్బతినే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.



ముచ్చింతాల వద్ద ఎస్సీ శ్మశాన వాటిక చుట్టూ చేరిన వర్షపు నీరు



అనిగండ్లపాడు వద్ద నీట మునిగిన పొలాలు



ముచ్చింతాల వద్ద పొలాల్లోకి చేరిన నీరు



మక్కపేట రైల్వేట్రాక్ సమీపంలోని అండర్‌పాస్‌లో నిలిచిన వరదనీరు

ఓటరు వెరిఫికేషన్‌కు సహకరించాలి



నందిగామ: డివిజన్ వ్యాప్తంగా జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమానికి సంబంధించి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా బీఎల్‌ఓలు ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. అందరి సహకారంతోనే నాణ్యమైన ఓటరు జాబితా సిద్ధం చేయడం సాధ్యమవుతుందన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయడమే లక్ష్యంగా సిబ్బంది పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నరసింహారావు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్ సంఘటనలపై చర్యలు తీసుకోండి

జగ్గయ్యపేట అర్బన్: మణిపూర్‌లో జరిగిన అమానుష సంఘటనలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొదమల ప్రభుదాసు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఓ ప్రకటన ద్వారా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. గత రెండు నెలలకు పైగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత కాలం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇది దేశ ప్రజల భద్రతకు రక్షణ లేనితనాన్ని స్పష్టం చేస్తుందన్నారు. దేవాలయాలు తగలబెట్టడం, ఇళ్లను లూటీ చేయడం, వందల మంది నిరాశ్రయులవడం, స్త్రీలను నగ్నంగా ఊరేగించి అవమానించడం సిగ్గుచేటన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, హింసకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

1 నుంచి యోగా శిక్షణ తరగతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అజిత్ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఆగస్టు 1వ తేదీ నుంచి యోగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ చొరవ మేరకు శిక్షణ చేపట్టామని, కేంద్ర ఆయుష్ విభాగం ఒక యోగా ట్రైనర్‌ను ప్రత్యేకంగా నియమించిందని తెలిపారు. యోగాసనాలతో పాటు ఆరోగ్య సూత్రాలను వివరిస్తారన్నారు. ఆసక్తి గల వారు శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 76278 48484 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మొహర్రం ఉత్సవాలు ప్రారంభం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని జల్‌జలే సాహెబ్ పంజా వద్ద మొహర్రం ఉత్సవాల్లో భాగంగా పీర్ల పండుగ ప్రారంభమైంది. మంగళవారం ఉదయం పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం హజరత్ మహబూబ్ సుభానీ జెండా ఊరేగింపు, రాత్రి ఫాతేహాఖాని జరుగుతుంది. బుధవారం రాత్రి అగ్నిగుండం, గురువారం పలువురు మతగురువులతో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం చేస్తారు. శుక్రవారం మేళతాళాలతో అగ్నిగుండం, శనివారం మెయిన్ రోడ్డులో పీర్లు ఊరేగింపు జరుగుతుందని జల్‌జలే సాహెబ్ పంజా ఆర్గనైజింగ్ సొసైటీ సభ్యులు తెలిపారు

టీడీపీకి ఓటమి భయం పట్టుకుంది

జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ నేతలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నేతలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంతో పాటు నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ. 561.98 కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గెలుపు ఖాయమని భావించిన టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, దీంతో వారు చౌకబారు విమర్శలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని పట్టణ వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉదయభానుపై మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

- కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉదయభాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఆయన గెలుపును ఖాయం చేశాయని, ఇది జీర్ణించుకోలేని శ్రీరాం తాతయ్య నిరాశ, నిస్పృహకు గురై నిందాపూర్వకమైన నిరాధార ఆరోపణలు చేస్తున్నాడని ఆరోపించారు.
- మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఉదయభాను ఫొటోగ్రాఫర్ మద్యం కేసులో పట్టుబడితే దానిని ఉదయభానుకు ఆపాదించడం బాధాకరమని, తప్పు చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదని అన్నారు.
- మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ గంజాయిని ప్రోత్సహిస్తున్నారని అంటున్నారని, దీనిపై ఆధారాలు చూపించే దమ్ము, ధైర్యం మీకు ఉన్నాయా అని నిలదీశారు.
- పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ మాట్లాడుతూ ఒక బీసీ మహిళను ప్రేమిస్తున్నానని నమ్మించి ఆమె చావుకు కారణమైన నేరస్తుడికి కౌన్సిలర్‌గా టికెట్ ఇచ్చి నేరస్తులను ప్రోత్సహిస్తుంది మీరు కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు



పెనుగంచిప్రోలులో నారు తీస్తున్న కూలీలు

మునేరు, బోర్లు, చెరువుల కింద అధిక సాగు

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది తొలకరి ఆలస్యం అయినా.. వారం రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలతో పాటు మునేరుకు, కాలువలకు వస్తుండటంతో మునేరు, బోర్ల కింద రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. అలాగే చెరువులు కూడా నిండు కుండలా ఉండటంతో రైతులు రెట్టింపు ఉత్సాహంతో సాగు ప్రారంభించారు. అధిక దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు ముందుకు సాగుతున్నారు. దీంతో పంట పొలాలు రైతులు, రైతు కూలీలతో కళకళలాడుతున్నాయి.

పేట నియోజకవర్గంలో ఇలా..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఏటా ఖరీఫ్‌లో సుమారు 9 వేల హెక్టార్లలో వరి పంట సాగవుతోంది. జగ్గయ్యపేట మండలంలో 3,500 హెక్టార్లలో, పెనుగంచిప్రోలు 3వేలు, వత్సవాయి మండలంలో 2,600 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రధానంగా రైతులు సాంబ మసూరి, బీపీటీ 5204 రకాల విత్తనాలను ఎక్కువగా పండిస్తున్నారు. మునేరు, బోర్లు, బావులు, చెరువులు కింద పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు, వత్సవాయి మండలంలో ఆళ్లూరుపాడు, రేగులగడ్డ పొలాల్లో నాట్లు వేస్తున్నారు. అలాగే నియోజకవర్గంలోని చెరువులు కింద కూడా రైతులు పంటసాగుకు సిద్ధంగా ఉన్నారు. ఈఏడాది నీటి లభ్యత ఎక్కువగా ఉండటంతో సాగు విస్తీర్ణం కూడా పెరిగే అవకాశం ఉందని అన్నదాతలు అంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇవ్వటంతో పాటు విలువైన సమాచారాన్ని అందిస్తున్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలతో నాట్లు వేసే పనిలో బిజీగా ఉన్నారు.

మందులు జాగ్రత్తగా వాడాలి..

రైతులు మోతాదుకు మించి పురుగు మందులు వాడ కూడదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. యూరియా కూడా తగిన పరిమాణంలో మాత్రమే వాడాలని అంటున్నారు. అధునాతన పద్ధతుల్లో సాగు చేస్తే ఎరువులు, పురుగు మందుల ఖర్చులు తగ్గే అవకాశం ఉందని వివరిస్తున్నారు. రేగడి భూముల్లో దమ్ము పూర్తి చేసిన రెండు రోజుల్లో నాట్లు వేస్తే రైతులు ఆశించిన మేర ఫలితం ఉంటుందంటున్నారు. వరినారు మొక్కలు లేతాకు పచ్చరంగులో ఉండి, నాటు పైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

వ్యవసాయ శాఖ సలహాలు పాటించాలి



రైతులు వ్యవసాయ శాఖ ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలి. దీని వల్ల ఎరువులు, పురుగు మందుల వాడకం అదుపులో ఉండి ఖర్చులు తగ్గుతాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులతో పాటు అవసరమైన అన్ని రకాల సమాచారాన్ని అందిస్తున్నాం.

– రామసుబ్బారెడ్డి, ఏఓ

సామాన్యుల చెంతకే ప్రభుత్వ సేవలు



కార్యక్రమంలో భాగంగా సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



ధర్మవరప్పాడుతండాలో లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న తహసీల్దార్

నందిగామ: సామాన్యుల చెంతకే ప్రభుత్వ పథకాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం నందిగామ పట్టణ పరిధిలో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణంలోని 10వ సచివాలయ పరిధిలోని అనాసాగరం గ్రామ సమీపంలోని వజినేపల్లి గార్డెన్స్ లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులకు 1290 సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఓర్సు లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, వార్డ్ ఇంచార్జ్ రవీంద్ర, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు ఉచితం..

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను త్వరితగతిన ఉచితంగా అందిస్తున్నట్లు తహసీల్దార్ చిన్నారావు పేర్కొన్నారు. గ్రామంలోని సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. 712 మందికి ప్రభుత్వ సేవల సర్టిఫికెట్‌లు అందజేశారు. సర్పంచ్ మణి, కార్యదర్శి శివాజీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, యూత్ కన్వీనర్ సాయి, నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇబ్బందులు



కార్యాలయంపై కాంట్రాక్టర్ కప్పిన పట్టాలు

నందిగామ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం కొద్దిపాటి వర్షానికే నీళ్లు ఒడుస్తోంది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనంలో ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవలే రూ. 13.35 లక్షలతో మరమ్మతులు చేయించింది. కాంట్రాక్టర్ ఈ పనులు చేసి కొద్ది నెలలు మాత్రమే గడుస్తోంది. మంగళవారం కురిసిన భారీ వర్షానికి తహసీల్దార్ కార్యాలయం నీరు ఒడుస్తుండటంతో సదరు కాంట్రాక్టర్ హడావుడిగా పైకప్పుపై పట్టాలు ఏర్పాటు చేశాడు. కాంట్రాక్టర్ చేసిన నిర్లక్ష్యపు పని కారణంగా లక్షల రూపాయలు వెచ్చించి కూడా ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే పరిస్థితి నెలకొంది. దీనిపై తహసీల్దార్ నరసింహారావును వివరణ కోరగా కార్యాలయంలో వర్షం నీరు ఒడుస్తున్న నేపథ్యంలో సదరు కాంట్రాక్టర్ పట్టాలు ఏర్పాటు చేశారన్నారు.

బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ రమేష్

రెడ్డిగూడెం: ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ ద్వారా ఎప్పటికప్పుడు తన బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈఓ రమేష్ అన్నారు. సమగ్ర శిక్ష షెడ్యూల్‌లో భాగంగా మంగళవారం నాగులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను సందర్శించిన రమేష్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. నాగులూరు కాంప్లెక్స్ చైర్మన్ ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.

ఇంగ్లిష్ బోధనలో మెలకువలు..

పెనుగొలను(గంపలగూడెం): ఇంగ్లిష్ బోధనలో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు తగిన మెలకువలు పాటించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేరీతిన బోధించాలని ఎంఈఓ పీవీడీఎల్ నరశింహారావు తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలనులో కాంప్లెక్స్‌లో మంగళవారం తిరువూరు, ఏకొండూరు, గంపలగూడెం మండలాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందజేస్తున్న శిక్షణను వినియోగించుకోవాలన్నారు. కాంప్లెక్స్ చైర్మన్ ఎం క్రిష్టాఫర్, మూడు మండలాల పరిధిలోని 51 మంది ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని నందిగామ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎం.వెంకటప్పయ్య అన్నారు. మూలపాడు జెడ్పీ పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రైమరీ లెవల్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం, రాయడం, అనర్గళంగా మాట్లాడటం నేర్పి ఉత్తమ విద్యార్థులుగా హైస్కూళ్లకు పంపాలని సూచించారు. బుధవారం రెండోరోజు కూడా సదస్సు జరగనుంది. ఎంఈఓలు సీహెచ్ పుష్పలత, ఎం.రత్నశ్యామ్‌బాబు, హెచ్ఎం డేవిడ్ రాక్ పెల్లర్ పాల్గొన్నారు.

కొండ ప్రాంతంలో కూలిన ఇంటి బేస్‌మెంట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల కురుస్తున్న వర్షాలకు విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని రావిచెట్టు సెంటర్ కొండపైగల ఒక ఇంటి బేస్‌మెంట్ కూలిపోయింది. దీంతో ఆ ఇంట్లో నివసిస్తున్న పసం వీరారెడ్డి కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి, డివిజన్ బాధ్యుడు షేక్ హయత్ షరీఫ్ మంగళవారం సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ఆదేశాల మేరకు కొండపైకి వచ్చి పరిస్థితిని సమీక్షించానన్నారు. వర్షాకాలం కొండ ప్రాంతంలో నివసించేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.